క్లుప్తంగా

నేడు శివంలో షిరిడీ సాయి దివ్య నాణేల దర్శనం

నల్లకుంట: షిరిడీ సాయి బాబా తన భక్తురాలైన లక్ష్మీబాయి షిండేకు ప్రసాదించిన 9 నాణాలు గురువారం షిరిడీ నుంచి నల్లకుంట శివం మందిరానికి తీసుకు వస్తున్నట్లు శ్రీ సత్య సాయి సేవా సంస్థల హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్వర రావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా శివంలో సాయంత్రం 6 గంటలకు బాబా ప్రసాదించిన నాణెములకు ప్రత్యేక పూజలు, వేద పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం బాబా స్వయంగా తన భక్తురాలికి ప్రసాదించిన 9 నాణెముల దర్శనం ఉంటుందన్నారు.

30నసాయి డయాగ్నోస్టిక్స్‌లో ఉచిత వైద్యశిబిరం

చిక్కడపల్లి: శ్రీ సాయి డయాగ్నోస్టిక్ సెంటర్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్యాంప్ నిర్వాహకులు లయన్ డాక్టర్ రమణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్లడ్‌షుగర్, కొలెస్ట్రాల్, థైరాయిడ్ పరీక్షలు చేస్తామని తెలిపారు. ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ వి.వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఉచితంగా బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు 040 27607687 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి


రాంకీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: బక్రీద్, బోనాల పండుగల సందర్భంగా రోడ్లపై పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అన్నారు. బుధవారం కాచిగూడ డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో చెత్త సేకరణ రాంకీ సంస్థ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాంకీ జోనల్ హెడ్ గోవర్ధన్ రెడ్డి, సర్కిల్ ఇన్‌చార్జ్ ప్రదీప్, బాల, శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సాధకులకు అవకాశం ఇవ్వాలి

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కుటుంబ పాలనను పారదోలి రాష్ట్ర అభివృద్ధికి పాటు పడే పార్టీని గెలిపించాలని అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్ అన్నారు. బుధవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో నిరుద్యోగ సమస్య నానాటికి పెరిగిపోతోందని, బెల్ట్ షాపులు, వైన్స్ షాపులు పెరిగిపోవడంతో యువత మద్యానికి బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మద్యం వద్దని అభివృద్ధి కావాలన్నారు. ట్యాక్స్‌ల రూపంలో ప్రజలు చెల్లించే డబ్బును ప్రజా అభివృద్ధికి మాత్రమే వినియోగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సురేందర్, సత్యం, మోహన్‌రావు, రాజారాం పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలం టెండర్ ఖరారు


టెండర్ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

కవాడిగూడ: భోలక్‌పూర్ డివిజన్ భవానీ శంకర్ ఆలయం వద్ద ఖాళీగా ఉన్న నాలుగు వేల గజాల పార్కింగ్ స్థలానికి బుధవారం ఆలయ నిర్వాహకులు స్టీల్ కవర్లలో టెండర్ నిర్వహించారు. ఎం.ఎస్.శివశంకర్ నెలకు రూ. 3.20 లక్షలు చెల్లించేందుకు అంగీకరిస్తూ టెండర్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జ్యోతి, పరిశీలన అధికారి అండాలు, సిబ్బంది శ్రీనివాసచారి, సురేష్ పాల్గొన్నారు.

మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో 'కార్పొరేట్' వైద్యం

మలక్‌పేట: మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో ప్రజలకు కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని అక్బర్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్ అన్నారు. నల్లగొండ క్రాస్ రోడ్‌లో ఉన్న మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫాకో మిషన్ బుధవారం కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధునాతనమైన ఫాకో మిషన్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు చేరువలో ఉన్నాయన్నారు.

ఘనంగా పీవీ నరసింహారావు జయంతి


పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ తదితరులు

నల్లకుంట: దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేసి అభివృద్ధికి బాటలు వేసిన దార్శనికుడు దివంగత పీవీ నరసింహారావు అని పీవీ జిల్లా సాధన సమితి, టీబీఎస్ఎస్ అధ్యక్షుడు పోచంపల్లి రమణా రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారత రత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. బుధవారం నల్లకుంటలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్), పీవీ నరసింహా రావు జిల్లా సాధన సమితి సంయుక్తాధ్వర్యంలో మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు 101వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం నాగోల్‌లోని పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోచంపల్లి రమణా రావు మాట్లాడుతూ తెలంగాణలో ఏదైనా ఒక జిల్లాకు పీవీ పేరు పెట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు యాతంరెడ్డి భవానీ, కేశరాజు సుధర్శన్ రావు, టీబీఎస్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంత్రి సునీల్, దేవులపల్లి అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి అక్కినేపల్లి పురుశోత్తమ రావు తదితరులు పాల్గొన్నారు.

పీవీ ఆశయసాధనకు కృషి చేయాలి

కవాడిగూడ: క్లిష్ట సమయంలో దేశాన్ని కాపాడిన తెలంగాణ ముద్దుబిడ్డ మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహా రావు అని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. యువత ఆయన ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. బుధవారం పీవీ జయంతిని పురస్కరించుకుని నెక్లెస్ రోడ్డులోని ఆయన సమాధి వద్ద పూల మాల వేసి నివాళులర్పించారు.

బహు భాషా కోవిదుడు పీవీ

ముషీరాబాద్: తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ బహు భాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణల రూపకర్త అని పలువురు కొనియాడారు. పీవీ జయంతి సందర్భంగా రాంనగర్ గుండు వద్ద అడిక్‌మెట్ డివిజన్ బ్రాహ్మణ సమాఖ్య నాయకులు కౌండిన్య ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం పీవీ నర్సింహారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొండపల్లి మాధవ్, కరణం సురేష్, శ్రీధర్‌శర్మ, సుబ్రహ్మణ్యబాబు, శేషసాయి, రాజాటి నరేష్, సాయికృష్ణ యాదవ్, రఘు, సూర్య నారాయణశర్మ, వంశీ, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


పీవీ నర్సింహారావు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న గోవర్ధన్‌రెడ్డి తదితరులు

నగేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో...

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో..

నల్లకుంట: తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో బుధవారం నల్లకుంట శ్రీధర్ ప్లాజాలో మాజీ ప్రధాన మంత్రి దివంగత పీవీ నరసింహారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య గౌరీ శంకర్ పీవీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రామకృష్ణ చంద్రమౌళి, బడేసాబ్, తిరుమల రావు, నాగేశ్వర రావు, జయరాము తదితరులు పాల్గొన్నారు.


పీవీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య గౌరీ శంకర్ తదితరులు


రాంనగర్ గుండు వద్ద..

తొలగించిన 26 కులాలను బీసీ జాబితాలో కలపాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ జాబితా నుంచి తొలగించిన 26 బీసీ కులాలను వెంటనే బీసీ జాబితాలో కలపాలని కోరుతూ తొలగించబడిన 26 బీసీ కులాల జేఏసీ చైర్మన్ ఆళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో బీసీ సంఘాల ప్రతినిధులు బుధవారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావును కలిసి వినతి పత్రం అందజేశారు. గవర, శెట్టిబలిజ, తూర్పుకాపు, పొందర తదితర కులాలను బీసీలుగా బీసీ కమిషన్ గుర్తించి అందుకు అనుగుణంగా నివేదికలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టుకు సమర్పించాలన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు జోక్యం చేసుకుని 26 కులాలకు సత్వర న్యాయం చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు.


బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆళ్ల రామకృష్ణ

కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఉద్యోగుల పెన్షనర్స్ సంక్షేమ సమితి, జాతీయ బీసీ హక్కుల రక్షణ సమితి ప్రతినిధులు పీవీవీ సత్యనారాయణ, కర్రి రాజశేఖర్, మల్ల సావిత్రి, ఎస్.వెంకటేశ్వర రావు, సూరి అప్పారావు, యుగంధర్ ఆళ్ళ, మల్ల ఆదిలక్ష్మి, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ అడ్మిషన్ విధానాన్ని రద్దు చేయాలి


మాట్లాడుతున్న రాజ్‌కుమార్

ముషీరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా 703 బీసీ హాస్టళ్లలో ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ గురుకులాల ఇన్‌చార్జిలుగా ఐఏఎస్ ఆఫీసర్లను నియమించాలని కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ ప్రవేశాల కారణంగా పేద, మధ్య తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మీసేవ, మండల కార్యాలయాల చుట్టు రోజుల తరబడి తిరగాల్సి వస్తుందన్నారు. నెట్ సెంటర్లలో సర్వర్లు డౌన్ అయి సహకరించక సర్టిఫికెట్లు అందక విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు లేని ఆన్‌లైన్ విధానాన్ని బీసీ విద్యార్థులకు ఎందుకు అమలు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. పాత పద్ధతిలోనే అడ్మిషన్లు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు అంబేడ్కర్ భవన్‌లో ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, సంఘం ప్రధాన కార్యదర్శి నందగోపాల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు భూపేష్ సాగర్, పగడాల సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ఫ్యామిలీ పెన్షన్ పెంచాలి

ముషీరాబాద్: జీవిత బీమా సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల ఫ్యామిలీ పెన్షన్‌ను 15 నుంచి 30 శాతానికి పెంచాలని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జీవిత బీమా సంస్థ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ 1995 పెన్షన్ పథకం ప్రకారం ఫ్యామిలీ ఫెన్షన్‌ను 15 శాతంగా నిర్ణయించారని అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెన్షన్ రివిజన్ జరుగుతున్నా, ఎల్ఐసీలో పెన్షన్ రివిజన్ లేనందున 15 శాతం అలాగే ఉందన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పోలిస్తే ఇది ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. వారి పెన్షన్ 30 శాతంగా పెంచాలని ఎల్ఐసీ బోర్డు 2019లో అంగీకరించి ఆర్థిక శాఖ మంత్రి ఆమోదానికి పంపించారు. అయితే మూడున్నర సంవత్సరాలుగా ఆర్థిక శాఖ దగ్గరే ఈ ఫైల్ పెండింగ్‌లో ఉందన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సంయుక్త కార్యదర్శులు రాంచందర్, శివగణేష్, రవీందర్, విజేందర్‌రెడ్డి, వెంకటరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, భూపేష్‌సాగర్, రాజ్ కుమార్, కె.రాము, నికిల్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్.కృష్ణయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎల్ఐసీ రిటైర్డ్ ఉద్యోగులు

రేపటి నుంచి ఉభయ వేదాంత పండిత సభలు

ముషీరాబాద్: ఉభయవేదాంత పండిత సభలు ఈ నెల 30 నుంచి జులై 1, 2వ తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ గౌరవ అధ్యక్షుడు, ఎస్వీఎస్ ట్రస్ట్ చైర్మన్ కందకురు యాదగిరిరావు తెలిపారు. ముషీరాబాద్ చంద్రపుకాలనీలోని శ్రీవైష్ణవ సదనంలో బుధవారం ఉభయ వేదాంత పండిత సభల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ, ఎస్వీఎస్ ట్రస్ట్, హైదరాబాద్, సత్సంప్రదాయ పరిరక్షణ సభ ట్రస్ట్, వరంగల్, ఉభయ వేదాంత పండిత పరిషత్, భాగ్యనగర్ శాఖ ఆధ్వర్యంలో వైష్ణవ సదనంలో ప్రప్రథమంగా ఉభయ వేదాంత పండిత సభలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 8గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయి అన్నారు. శుక్రవారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి హాజరవుతారన్నారు.

దారి దోపిడీ దొంగల రిమాండ్

అంబర్‌పేట: దారిదోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన బుధవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ ప్రభాకర్ కథనం ప్రకారం..... శివం రోడ్డులో హోటల్ నిర్వహిస్తున్న హమీద్ రజ ఈ నెల 20న తెల్లవారుజామున ఇంటికి వెళుతుండగా వెనక నుంచి బైక్‌పై వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ.11 వేల నగదును లాక్కెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం అలీకేఫ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. నిందితులు చంపాపేటకు చెందిన కావేటి శశికాంత్, దేవరోలు గణేష్ (20), మరో మైనర్ బాలుడగా గుర్తించిన పోలీసులు వారి నుంచి బైక్, సెల్‌ఫోన్, రూ.4 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లు స్వాధీనం



ముషీరాబాద్: ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఓ బార్‌లో అనుమతి లేకుండా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను సీజ్ చేసి విక్రయదారులపై కేసు నమోదు చేశారు. బుధవారం ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ లక్ష్మణ్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. లాలాపేట్‌లోని మైబార్ యజమాని వినోద్ కుమార్ తన బార్‌కు సంబంధించిన లైసెన్స్‌ను జూబ్లీహిల్స్‌లోని శతాబ్ది కిచెన్ అండ్ యాంప్ బార్‌కు బదిలీ చేశారు. అయినా ఎక్సైజ్ అనుమతులు లేకుండా అక్రమంగా లాలాపేట్‌లోని మైబార్‌లో మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి 16 కార్టన్లల బీర్లు, 180 ఎంఎల్ విస్కీ బాటిళ్లు 234, ఒక బీజర్ కాటన్, 750 ఎంఎల్ 10 కాటన్‌లు, 8 లీటర్ బాటిళ్లు 8 సీజ్ చేశారు. వీటిని విక్రయిస్తున్న జి.శ్రీశైలంతో పాటు మైబార్ షాపు యజమాని వినోద్‌కుమార్‌పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సైలు రమేష్ బాబు, ఎం.శ్రావణ్‌కుమార్, పి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

ముషీరాబాద్: వర్షాకాలం ప్రారంభమైనందున ఇళ్లల్లోకి నీరు రాకుండా వాగులు, నాలాలు పొంగిపొర్లకుండా జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల సమన్వయంతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్ ఆధ్వర్యంలో రాంనగర్ డివిజన్‌లోని లోతట్టు ప్రాంత ప్రజలు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలంలో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ముఠా జైసింహ, మన్నె దామోదర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మంత్రి కేటీఆర్ నిర్ణయం అభినందనీయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాటర్ బోర్డు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీవో నెంబర్ 14,60 ద్వారా వేతనాలు మంజూరు చేస్తూ మంత్రి కేటీఆర్ ఆదేశాలు ఇవ్వడం హర్షణీయమని వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్(బీఆర్‌టీయూ) అధ్యక్షుడు రాంబాబుయాదవ్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ పి.నారాయణతో కలిసి మాట్లాడారు. కార్మిక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. వాటర్ బోర్డులో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు చాలిచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని మంగళవారం మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి పెండింగ్‌లో 14, 60 జీవోను అమలు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ జీఓతో 3991 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు లబ్ధి చేకూరుతుందని, కార్మికులకు దాదాపు రూ. 4–5 వేల వరకు వేతనాలు పెరుగుతాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.కిరణ్‌కుమార్, నాయకులు ఆంజనేయులు, ప్రవీణ్, బి.కుమార్, బాబు, నరేందర్, హరీష్, మురళీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జి.రాంబాబు యాదవ్

కలుషిత నీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి


బుర్జుగల్లీలో నీటి సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్ పద్మ వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: కలుషిత నీటి సరఫరాపై జలమండలి అధికారులు అప్రమత్తంగా ఉండాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మవెంకట్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని బుర్జుగల్లీ, గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ ప్రాంతాల్లో నీరు కలుషితమైనట్లు స్థానికులు ఫిర్యాదు చేయడంతో బుధవారం ఆమె ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. సమస్యను స్వయంగా పరిశీలించిన కార్పొరేటర్ జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని ప్రాంతాల్లో తరచు కలుషిత నీటి సరఫరా సమస్య తలెత్తుతున్నా నిర్లక్ష్యం చేయడం తగదని జలమండలి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి, చుక్క జగన్, మిర్యాల శ్రీనివాస్, జలమండలి సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలు మతసామరస్యానికి ప్రతీకలు


ప్లాస్టిక్ కవర్లు పంపిణీ చేస్తున్న ముఠా జైసింహా


ప్లాస్టిక్ కవర్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్

కవాడిగూడ: బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకుని మతసామరస్యాన్ని పెంపొందించాలని బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహా అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని బుధవారం భోలక్‌పూర్‌లో జంతు వ్యర్థాలను తరలించేందుకు ప్లాస్టిక్ కవర్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జైసింహ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో జంతు వ్యర్థాలను తొలగించేందుకు 20 వేల ప్లాస్టిక్ బ్యాగులను జీ చేస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు వ్యర్థాల తరలింపునకు 15 ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు సామాజిక బాధ్యతతో రోడ్లపై జంతు వ్యర్థాలను వేయకుండా చెత్త డంపింగ్ కేంద్రాల్లో వేయాలని విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ సిబ్బంది పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలన్నారు. మసీదుల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, రాష్ట్ర నాయకులు రహీం, డివిజన్ మాజీ అధ్యక్షులు మహ్మద్ ఆలీ, డివిజన్ మైరాట కమిటి అధ్యక్ష, కార్యదర్శులు మగ్బూల్, జబ్బార్, నాయకులు ఖదీర ఆరీఫ్, జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏ హరినాథ్ పాల్గొన్నారు.

చిక్కడపల్లి: పండుగలు మతసామరస్యానికి ప్రతీకలని, ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ అన్నారు. బుధవారం గాంధీనగర్ డివిజన్ సబర్మతీ నగర్ బస్తీలోని సుభాని మసీద్ వద్ద ముస్లింలకు వ్యర్థ పదార్థాలను సేకరించేందుకు ప్లాస్టిక్ కవర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వినయ్‌కుమార్, ఉమేష్, మహమూద్, ఆనంద్, ఖదీర్, ఆదిల్, జుబైర్, కరీంబీ, యాకూబ్, బీబీజన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

కవాడిగూడ: బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచన శ్రీ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా మసీదులు, పరిసర ప్రాంతాల్లో వ్యర్థాలు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం కవాడిగూడ డివిజన్‌లో కుమ్మరబస్తీ సమీపంలోని మసీదులో ముస్లింలు, మసీదు నిర్వాహకులకు ప్లాస్టిక్ కవర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది అందజేసిన ప్లాస్టిక్ కవర్లలో వ్యర్థాలను వేసి మసీదు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని ముస్లింలకు ఆమె బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, యువమోర్చా నాయకులు బాణాల అనిల్‌కుమార్, శంకర్, మున్సిపల్ సూపర్‌వైజర్ సూర్యప్రకాష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో...

కాచిగూడ: బక్రీద్ పండుగ సందర్భంగా వెలువడుతున్న చెత్త చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు బుధవారం మసీదుల వద్ద జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ ఏఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతిబాయి ప్లాస్టిక్ కవర్లను పంపిణీ చేశారు. గోల్నాక డివిజన్‌లోని కృష్ణానగర్, నెహ్రూనగర్, హరాస్‌పెంట, నింబోలి అడ్డ, సుందర్‌నగర్ తదితర ప్రాంతాల్లో కవర్లను ఆమె పంపిణీ చేశారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఫరీద్, రయీస్, హఫీజ్ గౌస్, హఫీజ్ జావీద్, యూసుఫ్ బాయి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

కవాడిగూడ: తొమ్మిదేళ్ల పాలనలో ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు బీజేపీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం కవాడీగూడ డివిజన్ అరవింద్‌నగర్‌లో బూత్ నెంబర్ 47, 48లలో మహాసంకల్ప అభియాన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి, నియంత పాలన, ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నగర నాయకులు లింగంగౌడ్, డివిజన్ కోశాధికారి సూర్యనారాయణగౌడ్, నాయకులు జయమ్మ, శేఖర్‌నాయక్, సాయిలు, రాకేష్, మణిధర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రేమ్‌నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులు

అడిక్‌మెట్‌లో..

ముషీరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో తీసుకున్న నిర్ణయాలు, సాధించిన విజయాలు, అవినీతి రహిత పాలన, ప్రపంచ దేశాల్లో భారత దేశ ప్రతిష్ట ఎలా పెరిగింది అనే అంశాలపై బీజేపీ నేతలు బుధవారం అడిక్‌మెట్ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు.

మోదీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి

అంబర్‌పేట: నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశం ఎంతో పురోగతి సాధించిందని బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌ఛార్జ్ బి.వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో ఆయన హాజరై ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగభూషణం చారి, ఆనంద్‌గౌడ్, మైలారం రాజు, భిక్షపతి, భాస్కర్, కృష్ణ ముదిరాజ్, సరోజ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

గోల్నాకలో..

గోల్నాక జైస్వాల్ గార్డెన్‌లో బీజేపీ సీనియర్ నాయకులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.అనిల్‌చారి, బి.వినోద్, దిలీప్‌శర్మ, అనూప్, వెంకటేష్ పాల్గొన్నారు.